ప్రజాశక్తి

సోమవారం 26 ఆగస్టు 2024 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

చిత్త'శుద్ధి' ఎక్కడ?

- కిడ్నీ మహమ్మారిపై ఉద్యమాలు ఉధృతం
- నీరుగార్చేలా ప్రభుత్వం ప్రకటనలు
- ఏళ్ల తరబడి ముందుకు సాగని మంచినీటి ప్రాజెక్టు పనులు
- గంపలగూడెంలో మరొకరు మృతి



నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు



ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లాలో ఏళ్ల తరబడి కిడ్నీ వ్యాధి గ్రామాలకు గ్రామాలనే కబళిస్తున్న నేప్యాంలో ప్రజలను కాపాడాలని ఒక వైపు ఉద్యమాలు ఊపందుకుంటుంటే... మరొక వైపు ప్రజలను బుజ్జగించే ప్రకటనలతో ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతుంది. తిరువూరు, మైలవరం నియోజకవర్గాల పరిధిలోని బ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట, మైలవరం, ఇబ్రహీంపట్నం తదితర మండలాల పరిధిలోని పదులు సంఖ్యలోని గ్రామాల్లో కిడ్నీ వ్యాధి ప్రబలి వందల సంఖ్యలో ప్రజలు మృతిచెందారు. మరో వెయ్యి మందికి పైగా కిడ్నీ వ్యాధి ముదిరి జీవచ్ఛవాల్లా మృత్యువుతో పోరాడుతున్నారు. తాజాగా శనివారం రాత్రి గంపలగూడెం మండలంలోని అనుములంక గ్రామానికి చెందిన గొల్లమండల కష్ణ (62) వ్యాధి ముదిరి చికిత్స పొందుతూ మృతిచెందారు. విషతుల్యమైన భూగర్భ జలం (బోర్ వాటర్) తాగుతూ కిడ్నీ వ్యాధి బారిన పడి ఏ రోజు ఏ గ్రామంలో మృత్యువార్త వినాలో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే గిరిజన తండాల్లో మరణమృదం మోగుతుంది.

కిడ్నీ వ్యాధి నుంచి ప్రజలను కాపాడాలని, తక్షణమే కృష్ణాజలాలను తరలించి, ఆయా గ్రామాలకు రక్షిత మంచినీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేసి భావితరాలను కాపాడుకోవాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రమైన ఎ.కొండూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద కిడ్నీ వ్యాధితో (మిగతా 2లో)



శనివారం సిపిఎం ధర్నా సందర్భంగా కిడ్నీ బాధితులు కుప్పగా పోసిన మాత్రల స్ట్రిప్స్

శరవేగంగా ఎ.కొండూరుకు కృష్ణాజలాలు

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

ప్రజాశక్తి-విజయవాడ, తిరువూరు




సాగుతున్న పైపులైన్ పనులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాలకు సురక్షిత కృష్ణా జలాలను అందించేందుకు చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.సజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కిడ్నీ బాధితుల సమస్యలపై సిపిఎం అధ్వర్యంలో గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు శనివారం ఎ.కొండూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన నేపథ్యంలో కలెక్టర్ ఈ ప్రకటన చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 38 గ్రామాల ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన కృష్ణా సురక్షిత మంచినీటిని అందించేందుకు రూ.49.94 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులను వచ్చే ఏడాది జూన్ 30 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ అంతకుముందే పనుల పూర్తికి అధికార యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ వివరించారు. దీని కోసం గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) పరిధిలో పటిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా జలాలు ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లాలోని మైలవరం సీపీడబ్ల్యూసీ స్కీమ్ వరకు వస్తున్నాయని, ఇక్కడి నుంచి కుదపలోని సంప్ దగ్గరకు జలాలను తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంప్ నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా ఎ.కొండూరు మండలంలోని వివిధ గ్రామాలకు అందిస్తున్నట్లు వివరించారు. శాశ్వత ప్రాజెక్టు పనులు పూర్తయ్యే వరకు ఈ విధంగా తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామని, ఇటీవల రూ.1.60 కోట్ల డీఎంఎఫ్‌టీ గ్రాంట్‌ను కూడా ఇందుకోసం అందించినట్లు (మిగతా 2లో)

విజయవాడలో మంకీఫాక్స్ కలకలం

- ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు
- వదంతులు నమ్మొద్దు : సూపరింటెండెంట్ వెంకటేష్



ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

ఇప్పటికే ప్రపంచాన్ని మంకీఫాక్స్ వ్యాధి వణికిస్తున్న క్రమంలో విజయవాడలోనూ వ్యాధి లక్షణాలు ఉన్నాయంటూ కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో వార్త రావడంతో విజయవాడ వాసులు తీవ్ర ఆందోళన చెందారు. ఇటీవలే విదేశాల నుండి విజయవాడకు వచ్చిన ఒక కుటుంబంలో చిన్నారి శరీరంపై అలర్జీ కారణంగా దద్దుర్లు వచ్చాయి. దీంతో స్థానికంగా వైద్యుల వద్దకు తీసుకువెళితే మంకీఫాక్స్ అని అనుమానం వ్యక్త చేశారు. అయితే ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అలర్జీ కారణంగా దద్దుర్లు వచ్చాయని వైద్యులు చెప్పారు. అయితే చిన్నారి నమూనాలను మాత్రం సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.వెంకటేష్ మాట్లాడుతూ మంకీఫాక్స్ కేసులు విజయవాడ నగరంలో ఇప్పటి వరకు నమోదు కాలేదన్నారు. కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో అసత్య సమాచారం వస్తుందని, నగర వాసులు నమ్మవద్దని సూచించారు. మంకీఫాక్స్ వంటి కేసులు వచ్చినా పూర్తిస్థాయిలో చికిత్స అందించేందుకు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక ఐసోలేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా పడకలు, వెంటిలేటర్ సదుపాయాలతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సోమవారం ఉదయం వార్డు ప్రారంభిస్తామని, దీనికి ప్రత్యేక నోడల్ అధికారిని కూడా నియమిస్తామని, నర్సింగ్ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామాలే లక్ష్యంగా గ్రామసభలు విజయవంతం

- 289 గ్రామ పంచాయతీల్లో పూర్తి
- రూ.120.04 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- ఎన్‌టిఆర్ జిల్లా డ్వామా పీడీ సునీత





ప్రజాశక్తి-విజయవాడ

స్వర్ణ గ్రామాలే లక్ష్యంగా నిర్వహించిన గ్రామసభలు విజయవంతం అయ్యాయని ఎన్‌టిఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ (పి.డి) జె.సునీత పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఆమె వివరించారు. గ్రామ సభల ద్వారా ప్రజలు వారి అభిప్రాయాలను స్వయంగా తెలుపుకునేందుకు అవకాశం దొరికిందన్నారు. గ్రామ సభలు, వాటి ప్రాధాన్యత, చేసిన తీర్మానాలు, గ్రామాల్లో చేపట్టనున్న వివిధ రకాల పనులపై ఆమె 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: గ్రామ సభలు ఎన్ని చోట్ల జరిగాయి, ఎలా జరిగాయి?

ఎన్‌టిఆర్ జిల్లాలో గ్రామ సభలను విజయవంతం చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని 289 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజున రికార్డు స్థాయిలో గ్రామ సభలు నిర్వహించాం. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ఈ సభను విజయవంతం చేశాం.

ప్రశ్న: గ్రామ సభల్లో చర్చించిన అంశాలేమిటి?

గ్రామ అభివృద్ధి ప్రణాళిక (విడిపి)తో పాటు 2024-25 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు గుర్తించిన పనుల ఆమోదానికి సభల్లో చర్చ జరిగింది. ఇప్పటి వరకు చేపట్టిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులను కూడా అధికారులు గ్రామ ప్రజలకు వివరించారు. ఉపాధి హామీ పథకం వేతన దారుల హక్కులను తెలిపారు. జాబ్ కార్డు పొందే హక్కుతో పాటు పని కోరిన 15 రోజుల్లో పని పొందే హక్కు, ప్రణాళిక రూపొందించి, పనుల జాబితా తయారు చేసే హక్కు, చేసిన పని కొలతల ఆధారంగా వేతనాల చెల్లింపు తదితర అంశాలపై గ్రామ సభల్లో చర్చ జరిగింది.

ప్రశ్న: గ్రామ సభల లక్ష్యాలు, వాటి ప్రాధాన్యతను వివరించగలరు?

రాబోయే నాలుగైదు సంవత్సరాల్లో ఏమి చేయాలనే దానిపై ప్రజలందరి భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించుకునేందుకు ఈ సభలు ఎంతో దోహదపడతాయి. నిధులను, ఇతర వనరులను క్రమశిక్షణతో సద్వినియోగం చేసుకోవడం జరుగుతుంది. గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక అనేది ప్రజలందరి భాగస్వామ్యంతో జరగాలి అనే ఉద్దేశంతో ఈ సభలను నిర్వహించాం. కుళాయికనెక్షన్లు, మరుగుదొడ్డి సదుపాయం, వ్యక్తిగత కుటుంబాలకు మేలు చేకూర్చే పనులు, మురుగునీటి వ్యవస్థల నిర్వహణ, సిమెంట్ రహదారులు, ఘన వ్యర్థాల నిర్వహణ, మండల కేంద్రాలకు అనుసంధాన రహదారుల నిర్మాణం వంటి వాటి ప్రణాళికల రూపకల్పన, వాటిని పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించడం జరిగింది.

ప్రశ్న: గ్రామ సభల్లో ఆమోదం పొందిన పనులు, వాటి విలువను వివరించగలరు?

ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి, (మిగతా 2లో)

ఇబ్బడిముబ్బడిగా ఫ్లెక్సీల ఏర్పాటు

ప్రజాశక్తి-గన్నవరం: నిత్యం రద్దీగా ఉండే హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్ల కూడలి నుంచి రహదారికి ఇరువైపులా మరియు డివైడర్ పై ఎటువంటి అనుమతులు లేకుండా చాలామంది ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొంతమంది రోడ్డు పక్కన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా మరికొందరు రహదారి విభాగిని (డివైడర్) పై ఉన్న స్తంభాలకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే సమయంలో వాటిని వేలాడేలా ఉండేందుకు కర్రల సహాయంతో వాటిని వేలాడేలా ఉంచారు. ఒక కుటుంబంలోని వ్యక్తి మరణించిన, రాజకీయ నాయకులు పుట్టినరోజులు, పదవియోగం, ఏ కార్యక్రమంలోనైన పాల్గొనేందుకు వస్తున్న సమయంలో అభిమానులు ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలు కార్యక్రమాలు ముగిసిన అనంతరం సైతం అలానే వేలాడుతున్నాయి. ఒక వ్యక్తి మతి చెందితే అభిమానంతోనూ, బాధతోనూ, నాయకులకు స్వాగతం పలికేందుకు, కొందరు వ్యాపారుల వ్యాపార ప్రచారానికి కొందరు వ్యక్తులు చేస్తున్న పనులు వారికీ తెలియకుండానే మరికొందరికి ఇబ్బందులను కలుగచేస్తున్నాయి. ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఎక్కువ రోజులు అలానే ఉండడం వలన ఎండకు ఎండి, వర్షానికి తడిచి ఇదురుగాలులకు అటూ ఇటూ కదులుతూ ఫ్లెక్సీలలో ఉన్న కర్రలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారుతున్నాయి. రహదారిపై వెళుతున్న ద్విచక్ర వాహనదారులకు ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. అలానే ప్రధాన మలుపుల వద్ద ఇష్టానుసారంగా భారీ స్థాయిలో ఫ్లెక్సీలుఏర్పాటు చేయడం వలన దగ్గర వరకు వచ్చేంతవరకు ఎదురుగా ఎవరు వస్తున్నారో తేలిక ప్రమాదాలు జరుగుతున్నాయి. జంక్షన్ కూడలిలో ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ఏర్పాటు చేసిన ఐలాండ్‌కు సైతం కొంతమంది ఫ్లెక్సీలు కట్టిన పోలీసులు స్పందించకపోవడంతో మరికొందరు అదే బాటలో పయనించారు. జరగబోవు ప్రమాదాన్ని గుర్తించి ఒక కానిస్టేబుల్ తాత్కాలికంగా కొన్ని ఫ్లెక్సీలు తొలగించారు. అలానే రహదారి డివైడర్ పై 20 అడుగుల ఎత్తులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన అవి తొలగించేందుకు పంచాయతీ అధికారులు కానీ, పోలీసులు గానీ చర్యలు తీసుకోకపోవడం వలన ఎవరికి నచ్చినట్లు వారు ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రస్తుతం ఉన్న ప్రమాదకర పరిస్థితుల్లో మార్పు తీసుకురావాలని కోరుతున్నాను.

రాజధానిలో విస్తరిస్తోన్న వ్యాపార రంగం

ప్రధాన రహదారుల పక్క స్థలాలకు డిమాండ్



తుళ్లూరులో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటైన వ్యాపార దుకాణాలు



తుళ్లూరులో ప్రధాన రహదారి పక్కన ఖాళీ స్థలంలో నిర్మాణం

ప్రజాశక్తి - తుళ్లూరు

'రాజధాని గ్రామాల్లో ప్రధాన రహదారి పక్కన కొద్దిపాటి సొంత స్థలం ఉంటే చాలు..నెల నెలా అద్దె రూపంలో కొంత సొమ్ము వచ్చేస్తోంది.నిన్న మొన్నటివరకు ఎవరూ పట్టించుకోకపోవడంతో పిచ్చి కంపతో కనిపించిన స్థలాలు ఇప్పుడు రాత్రికి రాత్రి వ్యాపార దుకాణాలుగా మారుతున్నాయి.రాజధాని నిర్మాణ పనులు మొదలయ్యే వరకు వేచిచూడకుండా పెద్ద మొత్తంలో అద్దెలు చెల్లించి వ్యాపారాలు మొదలుపెడుతున్నారు...' రాజధాని అమరావతిలో వ్యాపార రంగం క్రమేపీ విస్తరిస్తోంది.చిన్న చిన్న వ్యాపార దుకాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి.స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందినవారు రాజధానిలో వ్యాపారాలకు పెట్టుబడి పెడుతున్నారు. మందడం, వెలగపూడి, రాయపూడి, తుళ్లూరు తదితర గ్రామాల్లో ప్రధాన రహదారిపై ఇరుపక్కలా కొత్తగా దుకాణాలు వెలుస్తున్నాయి.కూరగాయల మార్కెట్లు,ఫ్యాన్సీ స్టోర్స్, టీ కొట్లు, రియల్ ఎస్టేట్ కార్యాలయాలు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారుల పక్కన కొత్తగా పెద్ద సంఖ్యలో వ్యాపార దుకాణాలు వెలుస్తున్నాయి. ఎక్కువ అద్దె చెల్లించి మరీ వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రోడ్డు పక్కన సింగిల్ రూం కి రూ 10 నుంచి 15 వేల వరకు నెల అద్దె చెల్లిస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ప్రధాన రహదారి పక్కన ' టీ' కొట్టు పెట్టుకోవడానికి ఓ వ్యక్తి రూ 15 వేలు చెల్లించాడు.వైసిపి ప్రభుత్వంలో అప్పటివరకూ ఉన్న చిన్నా చితకా వ్యాపార దుకాణాలు మూతబడ్డాయి. 2015-17 మధ్యలో టిడిపి హయాంలో సచివాలయంకు కూతవేటు దూరంలో ఉన్న మందడం,వెలగపూడి గ్రామాల్లో పట్టణాల తరహాలో భారీ హంగులతో హెూటళ్లు వెలిశాయి.వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒకటీ అరా తప్ప దాదాపుగా అన్ని హెూటళ్లు,ఇతర వ్యాపారాలు మూతబడ్డాయి.వైసిపి ప్రభుత్వం మూడు రాజధానులు ప్రకటన,రాజధానిలో నిర్మాణాలన్నీ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో వ్యాపారస్తులు నష్టపోయారు. వ్యాపారాలు బాగా దెబ్బతినడంతో హెూటళ్లు, భారీ దుకాణాల యజమానులు కూడా మూటా ముల్లె సర్దుకోవాల్సి వచ్చింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వ్యాపారాలు ఆపేసి వెళ్లిపోయిన కొంతమంది మళ్ళీ రాజధాని మార్గం పడుతున్నారు. రాజధాని గ్రామాల్లో రోడ్డు పక్కన ఇప్పటివరకు నిరుపయోగంగా ఉన్న స్థలాలకు డిమాండ్ ఏర్పడింది.స్థల యజమానులు కొద్దిపాటి స్థలంలో షెడ్లు తరహాలో నిర్మాణాలు చేసి వ్యాపారులకు అద్దెలకు ఇస్తున్నారు. కొంతమంది ఇంటి నిర్మాణాలను ఆదాయ మార్గాలుగా మార్చుకుంటున్నారు.నాలుగు అంతస్తులలో భవనం నిర్మిస్తూ కింద వాహనాల పార్కింగ్ కోసం,వ్యాపారస్తులకు అద్దె కివ్వడమో,లేదా సొంతంగా తామే వ్యాపారం ప్రారంభించడమో చేయాలన్న ఉద్దేశంతో నిర్మాణాలు చేస్తున్నారు.మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరి నారాయణ రాజధాని నిర్మాణ పనులు డిసెంబర్ నుంచి మొదలవుతాయని ప్రకటించిన నేపధ్యంలో రాజధాని గ్రామాల్లో వ్యాపార రంగం రానున్న రోజుల్లో మరింత విస్తరించే అవకాశం ఉంది.

మొదటిపేజీ తరువాయి

స్వర్ణ గ్రామాలే లక్ష్యంగా గ్రామసభలు విజయవంతం

పలు పనులను ఆమోదించడం జరిగింది. రూ.120.94 కోట్ల విలువైన పనులకు గ్రామ సభల్లో ఆమోదం లభించింది. వీటిల్లో రూ.80 కోట్ల అంచనా విలువ కల్గిన సిసి రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం చేపట్టాలని, రూ.16.80 కోట్ల విలువైన పశువుల షెడ్లు నిర్మాణం, రూ.0.13 లక్షల సెరీ షెడ్లు, రూ.0.41 లక్షల ఉద్యాన పంటలు, రూ.0.55 లక్షల ప్లాంటేషన్, రూ.7.30 కోట్ల ఫాం ఫాండ్స్, రూ.1.32 కోట్ల మినీ అమృత్ సరోవర్లు, రూ.0.20 వాన నీటి సంరక్షణ, రూ.0.20 లక్షల అంచనా విలువ కల్గిన సామాజిక ఇంకుడుగుంతలు, రూ.4.68 కోట్ల వ్యక్తిగత ఇంకుడుగుంతలు, రూ.9 కోట్ల ఇతర పనులు, రూ.0.35 లక్షల కందకాల పనులు చేపట్టాలని నిర్ణయించారు.

శరవేగంగా ఎ.కొండూరుకు కృష్ణాజలాలు

వివరించారు. శాశ్వత ప్రాజెక్టు కింద కుదప సంప్ దగ్గరి కొండపై ఓవర్ హెడ్ రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. సంప్ నుంచి కృష్ణా జలాలను శుద్ధిచేసి ఈ ఓవర్ హెడ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. ఇక్కడినుంచి ఎ.కొండూరు మండలంలోని 38 కిడ్నీ ప్రభావిత గ్రామాలకు పైపులైన్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల ద్వారా నీరు సరఫరా జరుగుతుంది. ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులు తుదిదశకు చేరుకోగా 200 కిలోమీటర్ల మేర చేపట్టిన పైపులైన్ల పనుల్లో ఇప్పటికే 30 కిలోమీటర్లు పూర్తికాగా మరో 70 కిలోమీటర్లు పనులు చివరిదశలో ఉన్నాయి. ఎ.కొండూరులో మండలంలోని 38 గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఓవర్ హెడ్ రిజర్వాయర్లకు అదనంగా మరో 14 ఓవర్‌హెడ్ రిజర్వాయర్లను ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పనులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో వీలైనంత త్వరగా పనుల పూర్తికి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

చిత్తశుద్ధి ఎక్కడ?

బాధపడుతున్న వారిని కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందజేసి 15 రోజుల్లోపు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దిగి రాకపోతే కార్యాలయాలను స్తంభింప చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆ పార్టీ నేతలు హెచ్చరించారు. ఇదే క్రమంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో సిపిఐ ఆధ్వర్యంలో కూడా 'ప్రజాఆరోగ్య పరిరక్షణ' పేరుతో కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శరవేగంగా ఎ.కొండూరుకు కృష్ణాజలాల ప్రాజెక్టు పనులు, కిడ్నీ వ్యాధి ప్రభావిత 38 గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి అంటూ కలెక్టర్ పేరుతో ప్రకటన చేయడంతో పాటు మంచినీటి పైప్‌లైన్ల పనులు జరుగుతున్నట్లు నాలుగు ఫొటోలను జిల్లా కలెక్టర్ కార్యాలయం విడుదల చేయడం గమనార్హం. ఆయా గ్రామాల పరిధిలో ఉద్యమాలు జరిగి, ప్రజలు రోడ్లమీదకొస్తున్న ప్రతి సారి ప్రభుత్వాలు ప్రకటనలు ఇవ్వడం ఇదొక తంతుగా మారిందని ప్రజలతో పాటు వామపక్ష నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఎ.కొండూరు మండలంతో పాటు ఇతర మండలాల్లోని గ్రామాల్లో విజృంభిస్తున్న కిడ్నీ వ్యాధితో మృత్యుఘోషపై 2017లో మొదట సిపిఎం బయట ప్రపంచానికి ఈ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు కూడా కిడ్నీ వ్యాధి సమస్యను పరిష్కరించాలని, ఆయా గ్రామాల ప్రజలను రక్షించాలని కోరుతూ దశలవారీగా ఆ పార్టీ ఆందోళనలు చేస్తూనే వస్తోంది. అప్పటి నుంచి నేటి వరకు టిడిపి, వైసిపి ప్రభుత్వాలు మారుతున్నా, ఇరుపార్టీలు అధికారంలో ఉన్న ప్రతి సారి కృష్ణాజలాలను కిడ్నీ ప్రభావిత గ్రామాలకు తరలించి వారిని అదుకోవడం జరుగుతుందని, దీనికయ్యే సుమారు రూ.365 కోట్లను తమ ప్రభుత్వం వెచ్చిస్తుందని గత టిడిపి పాలనలో ఆనాటి పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్న నేటి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. ఆ తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వంలో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా ఇదే రీతిలో సుమారు రూ.370 కోట్ల వరకు ఖర్చు చేసి కిడ్నీ ప్రభావిత గ్రామాలకు రక్షిత మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందని ప్రకటించడమే తప్ప...నేటికీ కార్యరూపం దాల్చిన పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వాలు మారుతున్నాయి... పాలకులు మారుతున్నారు...కానీ కిడ్నీ వ్యాధి బాధితుల జీవితాల్లో, ఆయా గ్రామాల ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదని బాధిత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకుల్లో లోపించిన చిత్తశుద్ధి కారణంగా రక్షిత మంచినీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఒక్క అడుగు ముందుకు పడటంలేదు. ఒక వైపున కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాలకు కృష్ణాజలాలను సరఫరా చేయాలని ఉద్యమం ఉధృతం అవుతుంటే... మరొక వైపున వాటిని నీరుగార్చే ప్రకటనలతో కిడ్నీ ప్రభావిత గ్రామాల ప్రజలతో ప్రభుత్వం పరిహాసమాడుతుందనే చర్చ గిరిజన తండాల్లో నడుస్తోంది. ఇప్పటికయినా ప్రకటనలకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో కృష్ణాజలాలను తరలించి, కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల ప్రజలను కాపాడాలని బాధిత ప్రజలతో పాటు వామపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : కలెక్టర్



సామాజిక పెట్టుబడి నిధి రుణాల చెక్కులు అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా): జిల్లాలో స్వయం సహాయక సంఘం మహిళలను లక్షాధికారులను (లఖ్ పతి దీదీ) చేసే లక్ష్యంతో జీవనోపాధి కార్యక్రమాలపై తగిన అవగాహన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం మహారాష్ట్ర జల్గావ్‌లో నిర్వహిం చిన "లఖ్ పతి దీదీ సమ్మేళన్" కార్యక్రమానికి హాజరు కాగా, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ విసి హాలు నుండి వర్చువల్గా పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు 294 గ్రూపులకు 45.40 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలు, 460 గ్రూపులకు 6.18 కోట్ల రూపాయలు సామాజిక పెట్టుబడి నిధి రుణాల చెక్కులు పంపిణీతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో మొత్తం 9 కోట్ల మంది మహిళా సభ్యులు స్వయం సహాయక సంఘాల్లో ఉన్నారని, వారందరు సంఘంలోని వారి పొదుపుల నుండి , బ్యాంకు నుండి లింకేజి రుణాలు తీసుకుని, వారి కుటుంబం వివిధ రకాలుగా జీవనోపాధి సాగిస్తున్నారని తెలిపారు. అందులో 3 కోట్ల మంది మహిళలను రాబోయే 2024-25 సంవత్సరానికి లక్షాధికారి మహిళలుగా తీర్చిదిద్దాలని సంకల్పించం జరిగిందని,. అందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యం 20 లక్షల మంది మహిళలు కాగా మన కృష్ణా జిల్లా లక్ష్యం 77121 మంది మహిళలను లక్షాధికారులను చేయడం అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ/డిఆర్డిఎ పిడి ఇంచార్జి ఎస్ వి.నాగేశ్వర నాయక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు తోట నాగ మునిమ్మ, కోశాధికారి ఎన్ రాజకుమారి, స్వయం సహాయ సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

29న మండల స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఈనెల 29వ తేదీన మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు బివిఎస్ఎల్ పద్మావతి తెలిపారు. పాఠశాల వ్యవస్థాపకులు కానూరి దామోదరయ్య వర్ధంతి సందర్భంగా ఈ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల్లోని 9, 10 తరగతులు చదువు బాల బాలికలు ఈ పోటీలలో పాల్గొనాలని కోరారు. విజేతలైన బందాలకు సెప్టెంబర్ 9వ తేదీ బహుమతులు అందజేస్తారని తెలిపారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని యాత్రికులు అధిక సంఖ్యలో ఆదివారం దర్శించుకున్నారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మ వారి దేవస్థానానికి విచ్చేసిన యాత్రలకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన కార్యనిర్వ హణా ధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాట్లు పరిశీలించారు.

రేపు ఓపెన్ జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటల 30 నిముసాలకు గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన "ఓపెన్ జిమ్' యంపి వల్లభనేని బాలసౌరి, యంఎల్ ఏ యార్లగడ్డ వెంకట్రావులు ప్రారంభిస్తారని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవిఆర్ కిషోర్ తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి 49వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నెయ్యలవారి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమ్మవారి ప్రభను గ్రామం అంతా ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక వేషధారణతో, డప్పుల వాయిద్యాలతో బాణా సంచాలతో రంగరంగ వైభవంగా నిర్వహించిన ఎస్సై సత్యనారాయణ పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.



అశోక్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : కృష్ణా యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో పి.హెచ్.డి చేస్తున్న కోట అశోక్ కుమార్ కు డాక్టరేట్ లభించింది. బయోటెక్నాలజీ వి భాగా నికి సంబంధించి ఓవర్ ఎక్స్ ప్రెషన్ ఆఫ్ కాల్షియం బైండింగ్ ప్రోటీన్స్ ఫ్రం సెల్ వాల్ ఆఫ్ న్యూరోస్పోరా క్రాస్సా అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ను అందజేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జా మినేషన్స్. డా. కిరణ్‌కుమార్ తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం బయో టెక్నలజీ విభాగం ప్రొఫెసర్.జె. నవీన లావణ్యలత పర్యవేక్షణ లో అశోక్ కుమార్ పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందిన అశోక్ కుమార్ ను కృష్ణా యూనివర్శిటీలో వి.సి. ప్రొ. ఆర్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శోభన్ బాబు, ప్రొఫెసర్. రెక్టార్. ఎం. బసవేశ్వరరావు, ప్రొఫెసర్ మారుతి, హెచ్. ఓ.డి.డా . సుశీల, డా.వీరబ్రహ్మచారి, డా.మాధురి, డా.సురేష్, డా. కిషోర్, తదితరులు అభినందించారు.



గుడివాడలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గుడివాడ : జిల్లా ఎస్పి ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు గుడివాడలోని టిడ్కో గృహాల వద్ద పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాలుకా పోలీసు స్టేషన్ ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ ఈ ఆపరేషన్‌లో భాగంగా పాత నేరస్తులు, ట్రెబుల్ మంగర్స్, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, మద్యం అక్రమ రవాణా నివారణ, పాత కేసుల్లో నిందితుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వాహనాలకు సరైన పత్రాలు లేని కారణంగా 33 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సెర్చ్‌లో వివిధ పోలీసు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.



టిడ్కో గృహాల వద్ద కార్డెన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

కవుతరంలో ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో మండలంలోని కవుతరం కానూరి వారి కళ్యాణమండపం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి 40 మంది పిల్లలకు ఉచిత వైద్యపరీక్ష నిర్వహించగా, దంత వైద్య నిపుణులు డాక్టర్ అట్లూరి విద్యా సాహితి, డాక్టర్ గుత్తా శ్రావ్య వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని కానూరి సత్యనారాయణ ప్రారంభించగా లయన్స్ సభ్యులు. ఎన్ శశికళ, ఎం పెరుమాళ్ళు, కె నవాబు, వైపిసి ప్రసాద్, ఎస్ పరంధామయ్య, సిహెచ్ బాలాజీ, జి.రామకష్ణ, పొట్లూరి వెంకటేశ్వరరావు, పి. విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సేవా రత్న అవార్డుకు బుద్ధప్రసాద్ ఎంపిక

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సేవ రత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 26న చెన్నై రొయ్యపేటలోని మ్యూజిక్ అకాడమీలో శ్రీ కళాసుధ కృష్ణాష్టమి సిల్వర్ జూబ్లీ వాలిడిక్టరీ సెలబ్రేషన్ అవార్డ్స్ సెర్మనీ ఏర్పాటు చేశారు. వైద్య రాజకీయ నత్య సంగీత రంగాల్లో గుర్తింపు పొందిన వారికి అవార్డులు ప్రధానం చేయనున్నారు. శ్రీ కళా సుధా వ్యవస్థాపక అధ్యక్షులు బేసిరెడ్డి శ్రీనివాస్ స్వాగత ఉపన్యాసంతో ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, విజిఎన్ హౌమ్స్ క్రెడాయ్ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ పద్మా దేవదాస్, పద్మభూషణ పి సుశీల, ఆచార్య సీఎం కే రెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత ఎం ఎం రత్నం ప్రముఖులు విచ్చే యుచున్నట్లు తెలిపారు.



కీచక ఉపాధ్యాయుడు అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఈడుపుగల్లు మండల ప్రజా పరిషత్ పాఠశాలలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగికంగా వేధించిన కీచక ఉపాధ్యాయుడు మండవ వెంకట శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు కంకిపాడు పోలీసులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు కీచక టీచర్ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ సదరు ఉపాధ్యాయుడు విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఉన్నాయి.



పుల్లేరు కాలువలో బాలుడి కోసం వెదుకుతున్న దృశ్యం
ఇన్‌సెట్లో గల్లంతైన బాలుడు జోషి

పుల్లేరు కాలువలో బాలుడు గల్లంతు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : లోయర్ పుల్లేరు కాలువలో స్నానం చేస్తుండగా ఓ యువకుడు గల్లంతైన సంగటన ఆదివారం జరిగింది. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు శివారు నీలకంఠేశ్వ రపురం గ్రామానికి చెందిన కోలా జోషి (అభి) (17) ఆదివారం ఉదయం సమీపంలోని లోయర్ పుల్లేరు కాలువలో స్నేహితులతో కలిసి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటిలో మునిగిపోగా స్నేహితులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించగా అవకాశం లేకపోవడంతో వెంటనే స్థానికులకు తెలియజేశారు. దీనితో గ్రామస్తులు పోలీసులకు సమాచారం తెలపగా గుడ్లవల్లేరు ఎస్సై జి సత్యనారాయణ పోలీస్ సిబ్బంది, రెవిన్యూ, ఫైర్ సిబ్బంది కలిసి లోయర్ పుల్లేరు కాలువ ద్వారా క్యాంబెల్, బంటుమిల్లి, పోల్ రాజ్ వెళ్లే కాలువలలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి అయినా గాని జోషి ఆచూకీ అందలేదు. గ్రామం అంతా విషాదఛాయలు నెలకున్నాయి.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-ఉయ్యూరు : కడవకొల్లు గ్రామ పంచాయతీ పొట్లపాడు శివారులో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి కోడిపుంజు, కోడికత్తి, రూ. 4,800 నగదు స్వాధీన పరుచుకున్నట్లు ఉయ్యూరు రూరల్ ఎస్సై కొండవల్లి సురేశ్ బాబు తెలిపారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక కా ర్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, జూదాలు, కోడి పందేలు నిర్వహించే వారిని ఉపేక్షించేది లేదని ఎస్సై ఈసందర్భంగా హెచ్చరించారు. **ప్రజాశక్తి-వన్‌టౌన్ :** టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న పదిమందిని పోలీసులు అరెస్టుచేసి కేసు నమోదుచేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు మేరకు ఆదివారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో టూటౌన్ సిఐకి రాబడిన సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట, శ్రీనివాస మహల్ వెనుక పోతన వారి వీధిలో ఓ రేకుల షెడ్‌లో పదిమంది వ్యక్తులు కలిసి పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ సిఐ కొండలరావు సిబ్బంది సహాయంతో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడిచేసి వారిని పట్టుకొని వారి వద్ద నుండి రూ. 30,750 లను స్వాధీనపరుచుకుని, వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట: కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలో మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదివారం రాత్రి జగ్గయ్యపేట పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్డీఏ కూటమి నాయకులతో, మహిళలతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇలాంటి ఘటనలు సిగ్గుచేటన్నారు. ప్రతి ఒక్కరూ స్పందించి నిందితులను కఠినంగా శిక్షించే వరకు నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. అసలైన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం



జగ్గయ్యపేట : పట్టణ సమీపం లోని పాలేటివొడ్డున గల శివ పంచాయతన క్షేత్రం మఠం శివాలయం పునర్ని ర్మాణానికి యాత్రికులు దేవరశెట్టి రామారావు, ధర్మపత్ని వెంకట నరసమ్మ కుమారులు దేవరశెట్టి నాగేశ్వరరావు, దేవరశెట్టి నాగ శేఖర్, దేవరశెట్టి నాగప్రసాద్, దేవరశెట్టి నాగరాజు ఆలయ కమిటీ సభ్యులకు రూ.5.116 లక్షలు ఆదివారం ఆలయ నిర్మాణ ప్రతినిధులకు అందజేశారు.

అన్నదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పోతిన నాగమణి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించినట్లు ట్రస్ట్ ఛైర్మన్ పోతిన వరప్రకాష్ తెలిపారు. పోతిన నాగమణి 32వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిం చినట్లు ఆయన తెలిపారు. వర ప్రకాష్ మాట్లాడుతూ తన తల్లి నాగమణి పేరిట ఏర్పాటుచేసిన ట్రస్ట్ ద్వారా ఏటా అనేక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



బాధితుడికి 'దీవెన' చేయూత


ప్రజాశక్తి - వన్‌టౌన్ : నున్న ప్రకాష్ నగర్‌కు చెందిన వికలాంగుడు రాంబాబు నా అనేవాళ్లు లేక కొంత కాలం నుంచి ఆర్థికంగా ఇబ్బందులతో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సహాయం కొరకు దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించడం జరిగింది. ఈ నేపథ్యంలో దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారి తరపున ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను నున్న పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ సత్యరాజు, గ్రూప్ సభ్యులు రవి ఆదివారం వారి ఇంటికి వెళ్లి సహాయం అందజేశారు. పేదవారికి ఆపదలో ఉన్నవారికి సహాయం అందిస్తున్న గ్రూఫ్ సభ్యులకు రాంబాబు కతజ్ఞతలు తెలియజేశారు.



నిధులు దుర్వినియోగం

- ఇంటింటికీ నీటి కుళాయి పేరుతో లాభపడ్డ కాంట్రాక్టు సంస్థ

- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న చట్టన్నవరం గ్రామస్తులు



ప్రజాశక్తి - వీరులపాడు : 'ఇంటింటికీ కుళాయి అన్నారు... తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. నిధులు మంజూరు చేశామన్నారు.... తీరా చూస్తే నిధులు దుర్వినియోగం... ఇక నీటి కష్టాలు తీరతాయనుకున్న ఆశల మీద నీరు చల్లినట్లయింది' అని మండలంలోని చట్టన్నవరం గ్రామస్తులు వాపోతున్నారు.

చట్టన్నవరం మొత్తం జనాభా 1,500 మంది. 1000 మంది వరకు దళితులు ఉన్న ఈ గ్రామంలో తాగునీరందించేందుకు ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వారు రూ.10లక్షలు మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు సెప్టెంబరు 2022 సంవత్సరంలో మంజూరయ్యాయి. దీంతో పనులు చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు మార్చి 2023లో తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన రామా కన్‌స్ట్రక్షన్ అనే కాంట్రాక్ట్ సంస్థకు టెండర్ ఖరారు చేశారు. దీంతో ఆ కాంట్రాక్టు సంస్థ వారు పైప్‌లైన్ పనులు చేపట్టారు. మిగతా పనులేమీ అవ్వకుండానే అధికారులు రామా కాంట్రాక్ట్ వారికి బిల్లు మంజూరు చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనులు పూర్తి చేయకుండా అధికారులు కాసులకు కక్కుర్తి పడి బిల్లులు మంజూరు చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో జరిగిన నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టి శ్రీరామ కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్.కుమార్ చట్టను వరం గ్రామం

'తాగునీరు అందించేందుకు రూ.10 లక్షు మంజూరయ్యాయి. పూర్తిస్థాయిలో పని చేయకుండానే నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారు. దళితపేటలో రోజువారి ఇళ్లల్లో వాడుకోవడానికి పశువులకు కూడా తాగునీరు అందించలేని స్థితిలో ఉన్నాం. దూర ప్రాంతం నుండి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది'



కోట స్వామి : చటన్నరం

'జల్ జీవన్ మిషన్ హర్ ఘర్ జల్ పథకం నుండి మా దళితులకు తాగునీరు అందించే కొరకు పది లక్షల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మంజూరయ్యాయి. గ్రామంలో ఎటువంటి తాగునూరు సంబంధించి పనులు చేపట్టకుండానే బిల్లులు మంజూరు చేసుకొని కాంట్రాక్ట్ కనిపించకుండా పోయారు'




అరిగల వెంకటరత్నం

'అధికారులు కాంట్రాక్టులు కుమ్మక్కై ఎస్సీ కాలనీకి తాగునీరు అందించేందుకు పూర్తిస్థాయిలో పనిచేయకుండానే బిల్లులు మంజూరు చేశారు. ఆ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి'

అలరించిన సంస్కృతి కార్యక్రమం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : భారతీయ సంస్కృతి, కళలు, వృత్తులు వాటి విశిష్టతను భావి భారత పౌరులైన విద్యార్థులకు తెలియజేసేందుకు సంస్కృతి-2024 పేరిట వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది నగరంలోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్. విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని స్కూల్ చైర్మన్ అట్లూరి విజయబాబు తెలిపారు. నగరంలోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో ఆదివారం సంస్కృతి 2024 పేరిట మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమం విద్యార్థులను, తల్లిదండ్రులను అలరించింది. పల్లెటూరి వాతావరణం, వస్త్రధారణ, చిరు ధాన్యాలతో వంటలు ఇలా మన పూర్వీకుల జీవన విధానాన్ని తెలిపేలా చేసిన ఏర్పాట్లు చూపరులను మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ అట్లూరి విజయబాబు మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో మన పూర్వికుల ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు తెలపడం ద్వారా భవిష్యత్తు తరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలుస్తాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఉన్న విశిష్టతను, గొప్పతనాన్ని తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించమని ప్రిన్సిపల్ హర్ సిమ్రన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సురేంద్ర, విజయవాడ క్లబ్ సెక్రటరీ సతీష్ చంద్ర పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాజమాన్యం, అతిథులు




సాంప్రదాయ నృత్యాలతో అలరించిన విద్యార్థులు

భవానీ ద్వీపం అభివృద్ధికి కృషి

ఎంఎల్ఎ సుజనా


ప్రజాశక్తి, భవానీపురం : పర్యాటక ప్రదేశమైన భవానీ ద్వీపాన్ని అభివద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తానని పశ్చిమ ఎంఎల్ఎ యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. ఆదివారం ఎన్డీయే కూటమి నాయకులతో కలిసి భవానీపురంలోని భవాని ద్వీపాన్ని (ఐలాండ్) సందర్శించారు. భవానీ ద్వీపాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏపీ టూరిజం అధికారులు, సిబ్బందితో భవానీ ద్వీప సమస్యల గురించి ఆరా తీశారు. అక్కడికి వచ్చిన పర్యాటకులతో ముచ్చటించి సలహాలు సూచనలను తీసుకున్నారు. భవానీ ద్వీపాన్ని అభివద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని ఏపీ టూరిజం డివిజనల్ మేనేజర్ పి.ఎన్.కె.కృష్ణచైతన్యను ఎంఎల్ఎ కోరారు. అనేక అవకాశాలు, వనరులు ఉన్నప్పటికీ గత వైసిపి ప్రభుత్వం పర్యాటక ప్రాంతమైన భవానీ ద్వీప అభివృద్ధిని విస్మరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బెరం పార్క్ యూనిట్ మేనేజర్ శ్రీనివాసరావు, సుధీర్, రవీంద్ర, నాయకులు బొమ్మసాని సుబ్బారావు, అడ్డూరి శ్రీరామ్, ఎం.ఎస్ బేగ్, పైలా సోమినాయుడు పాల్గొన్నారు.



భవానీ ద్వీపంలో పర్యాటకులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

స్కోడా నుండి సరికొత్త కైలాక్ ఎస్‌యువి కారు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్కోడా ఆటో ఇండియా నుండి కొత్త కాంపాక్ట్ ఎస్‌యువి కైలాక్‌పేరుతో నూతన కారును తీసుకువస్తున్నట్లు స్కోడా ఆటో డైరెక్టర్ పీటర్ తెలిపారు. నగరంలోని స్కోడా డీలర్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో స్కోడా ఆటో కారు గురించి వివరాలను తెలిపారు. స్కోడా ఆటోమొబైల్ ఆధ్వర్యంలో సరికొత్తగా ఆవిష్కరించనున్న కారుకు పేరును ప్రకటించేందుకుగానూ వినియోగదారుల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. అందరి సూచన మేరకు కైలాక్‌గా పేరును ప్రకటించినట్లు తెలిపారు. ఎప్పటికపుడు నూతన కార్లను అందించడంలో స్కోడా సంస్థ వినియోగదారులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే స్కోడా పేరును సూచించేందుకు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించగా వినియోగదారుల వద్ద నుండి మంచి స్పందన లభించిందని తెలిపారు.



రూ.10 లక్షలతో అలంకరణ

జగ్గయ్యపేట: శ్రావణ మాస 3వ ఆదివారం ముత్యాలమ్మను రూ.10లక్షల కరెన్సీ నోట్లతో దేవస్థాన కమిటీ వారు అలంకరించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి దేవస్థానం కమిటీ ప్రెసిడెంట్ అప్పన మణికుమార్, వైస్ ప్రెసిడెంట్ నోముల శివకుమార్, సెక్రటరీ కొత్త రమేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ కొంకిమళ్ల సురేష్, ట్రెజరర్ అప్పన వెంకట పిచ్చయ్య, కమిటీ సభ్యులు చేడే వెంకట శ్రీరంగం, దేవర శెట్టి నాగప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లోనూ బాధితులే...

● విషజ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు ● రోగులను పిండేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు

ప్రజాశక్తి-గన్నవరం : గత పది రోజుల్లో విష జ్వరాలు, మలేరియా రోగాలు గ్రామాలను చుట్టేశాయి. ఇళ్లలో ఒకరి నుంచి ముగ్గురు వరకు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు రోగులను పిండేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో దోమల బెడద ఎక్కువై విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను వ్యాపింప చేస్తున్నాయని జనాలు ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు మందు పిచికారి చేయించినా దోమలు చావడం లేదు. రాత్రి పగలు తేడా లేకుండా జనాలపై దాడులు చేసి రక్తం పిలిచేస్తున్నాయి. మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతకమైన వ్యాధులను విస్తరింప చేస్తున్నాయి. దోమ కాటుతో జ్వరాల బారిన పడి పిల్లలు, పెద్దలు, వద్దులు అల్లాడుతున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు ఆసుపత్రిలోని వైద్యులు రోగులను పిండేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందే వారి సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకము లేక కొంతమంది ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. మరి కొంతమంది అప్పుల పాలవుతున్నారు. దీనికి కారణం డెంగి, మలేరియా వంటి రోగాలు వ్యాప్తి చెందడమే అని చెప్తున్నారు. గన్నవరం నియోజకవర్గంలోని నిడమానూరు, రామవరప్పాడు, ప్రసాదంపాడు,గన్నవరం, ముస్తాబాద, సూరంపల్లి, మాదలవారిగూడెం, తెంపల్లి, చిన్న అవుటపల్లి తదితర గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా ఆరోగ్య కార్యకర్తలు పంచాయతీ అధికారులు మురుగు కాలవల్లో పూడికలు తీయించడం, దోమల మందు పిచికారి చేయడం వంటి పనులు చేయిస్తున్నారు. అయినా విష జ్వరాలు ప్రబలుతూనే ఉన్నాయి. మందు కొట్టినా దోమలు చావని పరిస్థితి ఉందని జనాలు చెబుతున్నారు. రాత్రి అయితే చాలు ఇళ్లలోకి ప్రవేశించిన దోమలతో కంటిమీద కునుకు లేకుండా పోతుందని పేదలు అంటున్నారు. ప్రజల అవస్థలు వర్ణాతీతంగా ఉన్నాయని చెప్పాలి. ఆసుపత్రికి వెళితే 2వేల నుంచి 5 వేల వరకు ఖర్చు అవుతుందని లక్ష్మి అనే మహిళ తెలిపింది. మురుగు నీరు నిలవకుండా చేయడం ఎవరి వల్ల కావడం లేదు. జనాలు చెత్త పారవేయడంతో కాలవల్లో నీరు ఎక్కడిది అక్కడే ఉండిపోతుంది. కొంతమంది బాధ్యతారాహిత్యంగా చేసే పనుల వల్ల దోమలు పుట్టి పెరిగి చివరకు జనాల మీదే దాడులు చేస్తున్నాయి. ఆర్థికంగా ఉన్నవాళ్ళు దోమతెరలు బిగిస్తున్నారు. పేదలు చేసేది లేక దోమల మధ్యనే ఉంటున్నారు. జ్వరం వస్తే ప్రభుత్వాసుపత్రికి వెళుతున్నారు. పరిస్థితి విషమిస్తే ప్రైవేటు ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. అక్కడి వైద్యులు పలు రకాల టెస్టులు చేసి వేలకు వేలు గుంజుతున్నారు. వద్దులకు జ్వరాలు వచ్చి విపరీతమైన కీళ్ల నొప్పులు రావడం జరుగుతుంది. కొంతమందికి రక్తంలో ప్లేట్లెట్స్ పడిపోతున్న పరిస్థితి ఉంది. గత వారం రోజులుగా ఎండలు విపరీతంగా కాస్తున్న దోమల ఉధతి మాత్రం తగ్గడం లేదు. పంచాయతీ అధికారులు దోమల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇళ్లలో దోమల మందు పిచికారి చేయడంతో పాటు, మూడు రోజులకు ఒకసారి కాలవల్లో మందు పిచికారి చేయించాలని అంటున్నారు. ముఖ్యంగా దోమతెరలను పంపిణీ చేయాలని పేద మహిళలు కోరుతున్నారు. మందుల షాపుల్లో టాబ్లెట్లు కొనుక్కుని ఇళ్లలోనే ఉండి వాడే ఎంతోమంది ఉంటున్నారు. గ్రామాల్లో విష జ్వరాలు ఉన్నమాట వాస్తవమేనని వైద్యులు చెబుతున్నారు. కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి మందులు ఇస్తున్న పెద్దని పరిస్థితి ఉందట. ఇప్పటికైనా మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు రంగంలోకి దిగి దోమల సంగతి తేల్చుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. దీనికి ప్రజల సహకారం కూడా ఉండాలి. ఏదేమైనా దోమల నియంత్రణకు రోజువారి ఫాగింగ్ జరగాలి. డెంగ్యూ కేసులు నమోదు కాకముందే అధికారులు కళ్ళు తెరవాలని జనాలు కోరుతున్నారు.



గ్రామాల్లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



మోపిదేవిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, ఆలయ పండితులు, అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకునగా, ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జస్టిస్ బి. కష్ణ మోహన్ ని ఆలయ డిప్యూటీ కమీషనర్ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ సిబ్బంది, వేద పండితులు అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలను అందించారు.

పమిడిముక్కల ఎస్ఐగా శ్రీను బాధ్యతలు స్వీకారం



ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడి ముక్కల మండ లంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై భూక్య శ్రీను అన్నారు. ఆదివారం పమిడిముక్కల పోలీస్ స్టేషన్లో ఆయన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరులో పనిచేసి బదిలీపై పమిడిముక్కల పోలీస్ స్టేషన్కు వచ్చారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జూదాలు, పేకాట కోడిపందాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుం దన్నారు. ఎలాంటి అసాంఘిక చర్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంటా డ, పమిడిముక్కలలో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామన్నారు.

రోగులకు పరామర్శ

ప్రజాశక్తి-చల్లపల్లి : వైరల్ జ్వరాలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులను సిపిఎం బృంద సభ్యులు ఆదివారం పరామర్శించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రోగితోపాటు సహాయకులుగా ఉన్న వారికి కూడా భోజనం అందించాలని డిమాండ్ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల సిపిఎం కార్యదర్శి యద్దనపూడి మధు, మండల కమిటీ సభ్యులు లంకపల్లి సత్యనారాయణ, మహమ్మద్ కరిముల్లా బళ్ల వెంకటేశ్వరరావు, కలపాల దానయ్య, గోళ్ళ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ కు అభినందన తెలియజేస్తున్న సిపిఎం మండల కమిటీ సభ్యులు

ఎస్ఐకు అభినందనలు

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక పోలీస్ స్టేషన్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి.పి.వి సుబ్రహ్మణ్యంను సిపిఎం మండల కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో మండల కార్యదర్శి యద్దనపూడి మధు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, బళ్ళ వెంకటేశ్వరరావు, కలపాల దానయ్య, లంకపల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు ,

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - గుడివాడ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా గుడివాడ డివిజన్లోని వివిధ మండలాల్లోని ఉపాధ్యాయులకు ఆటల పోటీలను నిర్వహించినట్లు యుటిఎఫ్ కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు తెలిపారు. ఆదివారం స్థానిక ఏజీకే ఉన్నత పాఠశాలలో వివిధ రంగాల్లో ఆటలు, పాటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన జట్లు అలాగే వ్యక్తిగత విభాగాల్లోని విజయం సాధించిన వారు సెప్టెంబర్ మొదటి వారంలో అవని గడ్డలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏవీ వరలక్ష్మి, గుడివాడ పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే సతీష్ కుమార్, కే చంద్రశేఖర్, గుడ్లవల్లేరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆరోగ్యం శ్రీహరి, శ్రీనివాస్, స్టేట్ కౌన్సిలర్ చలసాని శ్రీనివాస్, ఆడిట్ కమిటీ మెంబర్ రాజారావు, సీనియర్ యుటిఎఫ్ కామ్రేడ్స్ వీడి వెంకటేశ్వరరావు, అమ్మన్న బాబు, శ్రీనాథ్, మధు, మురళి, రాజేష్, శివ, భాస్కరరావు, మత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీలలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆహారపు అలవాట్ల మార్పుతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రకృతి వైద్య నిపుణులు రామచంద్ర

ప్రజాశక్తి ఉయ్యూరు : ఆహారంలో కొద్దిపాటి మార్పుల ద్వారా ఇంటి వద్దనే దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించుకోవడం సాధ్యమే అని సిద్దార్థ యోగ విద్యాలయ ప్రకృతి వైద్య నిపుణులు రామచంద్ర అన్నారు. స్థానిక ఆర్యవైశ్య ప్రార్ధన మందిరంలో సిద్దార్థ యోగ విద్యాలయం ఉయ్యూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ఆరోగ్యం, ప్రకృతి వైద్యం, ఆరోగ్యానికి, వ్యాధుల నివారణకు ఆహారపు అలవాట్లపై సవివరంగా తెలియజేశారు. సమాజంలో ప్రస్తుతం వైద్యం ఖర్చుతో కూడుకున్నదే కాక కలిగే దుష్ప్రభావాలను సోదాహరంగా వివరించారు. పురుషులతో పాటు మహిళలో ఆనారోగ్య సమస్యలు తీసుకోవాలసిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, ప్రకతి వైద్యం. ఆహారమే ఔషదం ఇతర అంశాలపై ప్రకతి వైద్య నిపుణులు పద్మ తెలియజేశారు. కాగిత గోపాలకష్ణ, ఈఎల్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సులో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నూకల సాంబశివరావు, కుటుంబరాజు, యోగా గురువు సుబ్బారావు పాల్గొన్నారు. నూకల సాంబశివరావు లక్ష్మి దంపతులు వైద్యులను ఘనంగా సత్కరించారు



రోగులను పరామర్శిస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - మైలవరం : నిద్రమత్తులో ఎదురుగా వస్తున్న మినీ ట్రాన్స్‌పోర్ట్‌ను కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏ.కొండూరు మండలం ఖమ్మంపాడుకు చెందిన ఏసుబాబు విజయవాడ నుండి కారులో ఖమ్మంపాడు వెళుతుండగా మైలవరం బైపాస్ రోడ్ సర్వీసింగ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి నిద్ర రావడంతో ఎదురుగా ఉన్న మినీ ట్రాన్స్‌పోర్ట్‌ను కారు ఢీకొంది. ఈ ఘటనలో ఏసుబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వత్సవాయి : కొమరగిరి ట్రస్ట్, చిన్నఅవుట పల్లి పిన్నమనేని సిద్ధార్థ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన వత్సవాయిలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో పెద్ద ఎత్తున వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ వైద్య పరీక్షలో 116 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 19 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం రిఫర్ చేయడం జరిగింది. వారిని పిన్నమనేని సిద్ధార్థ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక బస్‌లో పంపించారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి ట్రెస్ట్ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, శ్రీ వెంకటేశ్వర స్కూల్ ప్రతినిధులు నెల్లూరి రవి, శ్రీనివాస్, పిఆర్ఓ రాఘవ, డాక్టర్స్ నజియా, ఫరూద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

జలాభిషేకం, సారె సమర్పణ

ప్రజాశక్తి మైలవరం : శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని కోట వెనుక ఉన్నస్థానిక శ్రీ కోట మహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం జలాభిషేకం, సారె సమర్పించారు. ముందుగా కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండల ఆర్యవైశ్య సంఘ సమావేశం స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో కంచికచర్ల మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా కొప్పు నాగరాజు ప్రధాన కార్యదర్శిగా జూలూరు శ్రీనివాసరావు, కోశాధికారిగా పెరుమాళ్ళ యశ్వంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు కంచికచర్ల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు అత్తులూరి నరసింహారావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాళ్ళా చిన్న సత్యం బాబు, జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కొత్తమాసు రామారావు జిల్లా సహాయ కార్యదర్శి చిరునోముల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ జయనరసింహారావు, ప్రాంతీయ కార్యదర్శి చంద్రుపట్ల రవి కిషోర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి కమిటీ చైర్మన్ అనుమోలు రంగారావు, జిల్లా యువజన కార్యవర్గ సభ్యులు జూలూరి విశ్వనాథం, దొడ్డా రామమోహనరావు, దివ్వెల కాశీ, వేములపల్లి వెంకటరత్నం, చందలూరు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతుంది. కొత్త ప్రభుత్వం రావటంతో నందిగామలో ఇసుక అక్రమార్కులు ఇసుక ట్రాక్టర్లు కొనుగోళ్లు చేశారు. ట్రాక్టర్ల ద్వారా ప్రతి రోజు ఇసుక అక్రమంగా రవాణా జరుగుతుంది. ట్రాక్టర్ ఇసుక నందిగామలో 1,400 నుండి 1,500 పైబడి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కువ లోడు ఆర్డర్ చెప్పితే వంద రూపాయలు తగ్గించి అమ్ముతున్నారు. నందిగామ పట్టణంలో అనాసాగరం, పాతబస్టాండ్ మునేరు, నందిగామ మండలం గోళ్లమూడి, దాములూరు, సోమవరం తదితర ప్రాంతాల్లో వైరా, మున్నేరు నుండి ఇసుక రేయింబవళ్లు తోలుకుని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులు ఒకటి రెండు ఇసుక ట్రాక్టరలకు కేసులు రాసి చేతులు దులుపు కుంటున్నారు. అదేమని



సామాన్య ప్రజలు ప్రశ్నిస్తే అధికార పార్టీ తాలూకా అని జవాబు ఇస్తున్నారు. అధికారులు స్పందించి నందిగామలో ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయికి బానిసలవొద్దు : ఎసిపి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : యువకులు గంజాయికి బానిసలుగా మారి తమ భవిష్యత్తును పాడుచేసుకోవద్దని గంజాయికి బానిసలుగా మారిన వారు తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకోవడమే అవుతుందని మైలవరం ఎసిపి సుంకర మురళీమోహన్ అన్నారు. ఆదివారం సాయంత్రం చీమలపాడు మెయిన్ సెంటర్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ పిల్లలపై తల్లిదండ్రులు నిత్యం నిఘా ఉంచి తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ ఉండాలని అన్నారు. గంజాయికి బానిసలుగా మారిన వారు కొంతకాలం తర్వాత డబ్బులు లేక దొంగతనాలకు అలవాటు పడతారని వారి భవిష్యత్తు శూన్యంగా మారుతుందని చెప్పారు. ఈ ప్రాంతంలో చైన్‌స్నాచర్లు ఉంటారని మహిళలు బంగారు ఆభరణాలు మెడల్లో ధరించుకొని బయటకు వెళ్లే సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 1.50లక్షలతో ద్విచక్రవాహనం కొంటున్న యువకులు రూ.500లతో హెల్మెట్ కొనుక్కోకపోవడం విచారకరమని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ వీడియోలు ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా



ఉండాలని కొందరు చదువుకున్న వారిని సైతం మోసగిస్తూ డబ్బులు గుంజుతున్నారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. చీమలపాడు సెంటర్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను వెనక్కి జరిపి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుల్‌ను నియమించాలని ఎ.కొండూరు ఎస్ఐ చల్లా కృష్ణకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

పత్తి రైతుకు ప్రాణం పోసిన వర్షం

ప్రజాశక్తి - మైలవరం : నిన్న మొన్నటి వరకు వేసవిని తలపించేలా ఎండలు ఉండటంతో రైతులు కలవరపడ్డారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట వేసి రెండు నెలలు అవుతున్నా సరైన వర్షాలు లేకపోవడంతో పత్తి ఎదుగుదల లోపించడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రానీ పరిస్థితి నెలకొందని పలువురు రైతులు వాపోయారు. మండలంలో గతేడాది 2,900 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈ ఏడాది 3,500 ఎకరాల్లో పత్తిని రైతులు సాగు చేపట్టారు. ఎకరానికి కౌలుతో కలుపుకొని పెట్టుబడి రూ.30 నుంచి 40 వేల వరకు ఖర్చవుతుందని రైతులంటున్నారు. అయితే పత్తి విత్తనం నాటిన తర్వాత జూన్, జూలై, ఆగస్టులో సరైన వర్షాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందారు. అయితే ప్రస్తుతం పత్తి గూడ దశలో ఉండటంతో ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని పలువురు పత్తి రైతులు పేర్కొంటున్నారు. పత్తితో పాటు మినుము, పెసర


సజ్జపాడులో పత్తి చేను

పంట కూడా వర్షం ప్రాణం పోసిందని, రైతులు అంటున్నారు. సకాలంలో వర్షాలు పడితే ఎకరానికి 15 నుండి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, గత ఏడాది పత్తికి మంచి ధర ఉండటంతో ఈ ఏడాది గతం కంటే ఎక్కువగా రైతులు పత్తి సాగును చేపట్టారు. ప్రస్తుతం పత్తి పంటకు డోకా లేదని రైతులు అంటున్నారు.

కమల్ బేకరి అండ్ గ్రిల్ చికెన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో పెద్ద మసీదు ఎదురుగా ఆదివారం నూతనంగా కమల్ బేకరీ అండ్ షావర్మ, గ్రిల్ చికెన్ ప్రారంభిం చారు. షాపు యజమాని యాకుబ్ మాట్లాడుతూ తమ వద్ద అన్నిరకాల కేకులు కూల్ కేకులు, మీకు నచ్చిన ఫ్లేవర్స్, మీకు నచ్చిన డిజైన్లతో బర్త్ డే కేకులు పార్టీ వేర్ కేకులు ఆర్డర్‌పై తయారుచేసి ఇస్తామని తెలిపారు. ఐస్‌క్రీమ్స్, చాక్లెట్స్, కూల్ డ్రింక్స్, నాచురల్ జ్యూస్, పుట్టినరోజు పార్టీలకు కావలసిన డెకరేషన్ వస్తువులు సరసమైన ధరలకు అందిస్తారని తెలిపారు. ఏగ్ పఫ్, కర్రీ పఫ్, చికెన్ పఫ్, ఎగ్ రోల్, పన్నీర్ పఫ్, నార్మల్ కేక్స్, కూల్ కేక్స్, రస్కులు, బ్రెడ్స్, బిస్కెట్స్ లభిస్తాయని తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం నందిగామ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. నందిగామ సిఐ వై.వి.వి.ఎల్ నాయుడు మాట్లా డుతూ రౌడీ షీటర్లు సక్రమ ప్రవర్తన కోసం ఏరియాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని హెచ్చరించారు. గంజాయి బెల్ట్ షాపుల నిర్వహణ గురించి మీకు తెలిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. తద్వారా సత్ప్రవర్తనకు అలవర్చుకోవచ్చని సూచించారు. రౌడీ షీటర్లు సరైన మార్గంలో నడుస్తూ గొడవలకు వెళ్లకుండా కుటుంబం ఉపాధి కోసం జీవన సాగించాలని, సక్రమంగా నడుచు కోవాలని కోరారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని, సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్లు ఎత్తివేస్తామని సిఐ తెలిపారు.





పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు


25న చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - తిరువూరు : విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలు పెంచి, తద్వారా వారు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడాలనే ఉద్దేశంతో జన విజ్ఞాన వేదిక ప్రతి ఏటా విద్యా శాఖ సౌజన్యంతో చెకుముకి సంబరాలను నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ తెలిపారు. సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయిలో చెకుముకి ప్రాథమిక పరీక్ష జరుగు తుందని అన్నారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చెకుముకి గోడ పత్రికను జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.హరి కృష్ణతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదివే 8,9,10వ తరగతి విద్యార్థులు ఈ చెకుముకి సంబరాల్లో పాల్గొన వచ్చున్నారు. నాయకులు ఎం.రాం ప్రదీప్, కె.పాపారావు, డి.సుదర్శన్, ఎం.సుధాకర్, జగన్మోహన్‌రావు, ఏసుపాదం, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.



కెఆర్‌ఎల్ నరసింహారావు సంస్మరణ సభ

జగ్గయ్యపేట: పట్టణంలో ఎస్.జి.ఎస్ కాలేజ్ యుజిసి బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కెఆర్‌ఎల్ నరసింహారావు సంస్మరణ సభలో శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురాం, మాజీ శాసనసభ్యులు, మాజీ ప్రభుత్వ విప్ సామి నేని ఉదయభాను వేరువేరుగా పాల్గొని నర సింహారావు చిత్రపటానికి పూలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం వారి కుటుం బ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



సమాక్య గ్రూపులకు చెక్కులు

జగ్గయ్యపేట: స్వయం సహాయక సంఘం సభ్యులకి ఆర్థిక చేయూతగా ప్రధాన మంత్రి అందజేస్తున్న చెక్కులను ఆదివారం ఎంఎల్ఎ రాజగోపాల్ తాతయ్య ఆయా గ్రూపు సభ్యులకు అందజేశారు. జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల వారికి రూ.10 లక్షల చొప్పున రాజగోపాల్ స్వగృహంలో శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా మండల సమాఖ్య అధ్యక్షులు గద్దె రాజ్యలక్ష్మి (జగ్గయ్యపేట), జి.శిరీష (వత్స వాయి)లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం




ఘంటసాల, మోపిదేవిలలో బాధితులకు సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాలలో నెలరోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధితులకు చల్లపల్లికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు విస్సంశెట్టి మారుతి రామ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఘంటసాల గ్రామంలోని సంత మార్కెట్ సమీపంలో నివాసముండే ఎస్టీలకు చెందిన నాలుగు గహాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మారుతి రామ్ ఒక్కొక్క కుటుంబానికి రూ.1000ల చొప్పున నాలుగు కుటుంబాలకు ఆర్థిక సాయమందించారు. కష్ణాజిల్లా ఆర్యవైశ్య ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా, విశ్రాంత డిఎస్పీ హరిరాజేంద్ర బాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకష్ణల చేతులమీదుగా ఈ ఆర్థికసాయం ఆదివారం సాయంత్రం బాధితులకు అందించారు. ఈ కార్యక్రమలో మంగళగిరి వేణు, బాధితులు అమతం బుడ్డిమ్మ, అమతం పెద్ద నాంచారమ్మ, అమతం వెంకమ్మ, అమతం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి మండలం వెంకటాపురం శివారు అన్నవరంలో ఇటీవల పేరుబోయిన నాంచారమ్మ పూరిల్లు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. బాధితురాలికి జనసేన పార్టీ నాయకులు విస్సంశెట్టి మారుతీరామ్ ఆధ్వర్యంలో ఆదివారం 25 కిలోల బియ్యం, నూతన వస్త్రాలు, రూ.వెయ్యి ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ విస్సంశెట్టి మొగిలేశ్వరగుప్తా, మోపిదేవి జనసేన మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి మండల శాఖ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ శ్రీ కష్ణ జన్మాష్టమి పండుగ ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేయడం జరిగిందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, జోనల్ కార్యాలయాల్లో , పోలీస్ కమిషనర్ కార్యాలయాల్లో కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నగర కమిషనర్ ధ్యానచంద్ర, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు.

500 మందికి అన్నదానం

విజయవాడ: ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణలంక తారకరామానగర్‌లో సుమారు 500 మంది నిరుపేదలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండర్ ట్రస్టీ రాసంశెట్టి నందకిశోర్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమాలు చేయడం వల్ల మనసుకు ఎంతో సంతోషం కలిగిస్తుందని, అందువల్లనే తమ ట్రస్ట్ ఎక్కువగా నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ తనూజారాణి, ట్రస్ట్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-తాడేపల్లి : కృష్ణాష్టమి సందర్భంగా తాడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని కృష్ణుని గుడి వద్ద సోమవారం వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గుడికి ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు అన్నసంతర్పణ, సాయంత్రం 4 గంటలకు ఉట్టికొట్టుట, 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెనుమాక శ్రీకృష్ణ యాదవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. వెన్నముద్ద వేలంపాట రూ.1.10 లక్షలకు మన్నవ రామారావు పాడారు. ఈ కార్యక్రమంలో కె.రంగబాబు, నాగరాజు, కొల్లి శేషు, వీరేంద్రనాథ్, చెన్నుబోయిన రాజేష్ పాల్గొన్నారు.



లైటింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టండి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య అధికంగా ఉందని, తక్షణమే గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. గన్నవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎక్కువ. మంది జ్వరం తో బాధపడుతున్నారని ఆదివారం సాయంత్రం జర్నలిస్టులు ఆయన దష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన అయన జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ గీతాబాయి, నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యులతోనూ, డీపీవో నాగేశ్వరావు నాయక్, పంచాయతీ కార్యదర్సులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గ్రామాల వారీగా ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితుల వివరాలు నమోదు చేసి ఆ వివరాలు తనకి తెలియజేయాలని ఆదేశించారు. జ్వరాలు ఎక్కువగా ఉంటే నివారణ చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారని సున్నితంగా మందలించారు. జ్వర పీడితులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో తక్షణమే వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు మందులు అందించడంతోపాటు, వైద్య సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్నవారిని ప్రభుత్వ వైద్యశాలలకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మంగళవారం ఉదయం పూర్తి వివరాలు, తీసుకున్న చర్యలతో తన క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి రావాలని కోరారు. అవసరం అయితే ప్రయివేట్ వైద్యుల సహకారంతో వైద్య శిబిరలు నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కు పాటుపడాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితుల వివరాలు నమోదు చేసి రోగులకు మందులు అందిస్తామని వైద్యాధికారులు ఎమ్మెల్యేలకి తెలిపారు. డిపివో, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఈఓపిఆర్డీలు, 45 మంది పంచాయతీ కార్యదర్సులతో వీడియో కాన్ఫరెన్సలో యార్లగడ్డ మాట్లాడుతూ తక్షణమే అన్ని గ్రామాల్లో డ్రైనేజి లు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. గతంలో తెంపల్లిలో డయేరి యాతో ఆరుగురు మృతి చెందారని అటువంటి దుస్థితి పునరావృతం కాకూడదన్నారు. విధి నిర్వహణలో అలస త్వంగా, బాధ్యతరహిత్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే యార్లగడ్డ హెచ్చరించారు.

గ్రామీణ ప్రగతికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఎన్డీఏ ప్రభుత్వంలో విస్తత గ్రామీణ ప్రగతికి కృషి చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఆదివారం అవనిగడ్డలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మన పంచాయతీ మన సాధికారత గ్రామసభలు గ్రామపంచాయతీలకు పూర్వ వైభవం తెచ్చాయని తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గంలో నిర్వహించిన గ్రామసభలు ప్రతి గ్రామంలో విజయవంతమైనట్లు తెలిపారు. నియోజ కవర్గంలోని 91 గ్రామపంచాయతీ కార్యాలయాలు వద్ద నిర్వహించిన ఈ గ్రామ సభలు ఆయా గ్రామాల అభివద్ధికి బాటలు వేశాయన్నారు. గ్రామసభల ద్వారా నియోజకవర్గంలో మొత్తం రూ 34.67 కోట్లతో 997 అభివద్ధి పనులకు ఆమోదం పొందినట్లు తెలిపారు. ఈ గ్రామ సభల ద్వారా నియోజకవర్గంలో రూ 24.40 కోట్లతో 301 సిసి రోడ్ల నిర్మాణం, రూ అయిదు కోట్లతో 11 సీసీ డ్రైనేజీ నిర్మాణం, 35 లక్షలతో ఆరు ప్రహరీల నిర్మాణ పనులు ఆమోదించినట్లు వివరించారు. పశుపోషకులను ప్రోత్సహించేందుకు నియోజకవర్గంలో 242 కాటిల్ షెడ్స్ నిర్మాణానికి 3.63 కోట్లు రాయితీగా అందించేందుకు ఆమోదం లభించినట్లు తెలిపారు. అదే విధంగా గ్రామసభల ద్వారా ఉద్యానవన రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో యానాదుల నివాసిత ప్రాంతాల్లోని రహదారుల సమస్యలు ఇటీవల ఎస్టీ సంఘం నాయకులు తన దష్టికి తీసుకువచ్చారని ఆయా సమస్యల పరిష్కారం కోసం ఉపాధి నిధులు మంజూరు చేసి గ్రామసభల ద్వారా ఆమోదం పొందినట్లు తెలిపారు

సత్తెమ్మ ఆలయానికి పంచలోహ విగ్రహం అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల సత్యమ్మ దేవాలయానికి ఆదివారం ఆర్టీసీ కాలనీకి చెందిన ముద్ర శ్రీహరి, దివ్యశ్రీ దంపతులు, శ్రీహరి తల్లిదండ్రులు ముద్ర ఆదినారాయణ, సంధ్య దంపతులు రూ.లక్ష విలువైన పంచలోహ సత్యమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ అర్చకులు మార్తి సాంబశివశాస్త్రీ, రాధాకృష్ణ శర్మకు అందజేశారు.





వినయ్ చంద్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి, వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు క్రీడలు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ చంద్ దంపతులు, అలాగే ప్రముఖ గాయని లలిత (నూతన) దంపతుల వారు ఆలయానికి విచ్చేయగా ఆలయ ఈవో కె.ఎస్. రామారావు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరు అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్నారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈవో శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



మందుబాబులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ

మందుబాబులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-భవానీపురం : భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై మద్యం సేవిస్తూ ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్న వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. సిటీ పోలీస్ కమిషనర్ రాజశేఖంబాబు ఆదేశాల మేరకు, వెస్ట్ డివిజన్ ఇంచార్జ్, నార్త్ ఏసిపి పర్యవేక్షణలో భవానీపురం పోలీస్ స్టేషన్ సిఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 15 మంది సిబ్బంది, ఇద్దరు ఎస్సైలతో సితార సెంటర్, ఎట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు, పంట కాలవ రోడ్డు, భవానీపురం ఔట్ ఏజెన్సీ, గొల్లపూడి కరకట్ట ప్రాంతాల నందు బహిరంగ ప్రదేశా లలో మద్యం సేవిస్తున్న 35 మందిని స్టేషన్‌కు తీసుకువచ్చి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఇష్టమొచ్చినట్లు బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లపై మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.

సిపిఎం జెండా ధ్వంసం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామంలో సిపిఎం దిమ్మపై ఉండా జెండాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు ఆ నిందితులను కఠిన చర్య తీసుకోవాలని సిపిఎం నాయకులు పామర్తి అప్పయ్య, బర్రె లెనిన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో మందుబాబులు స్వైర విహారం చేస్తున్నారని తెలిపారు. రాత్రి వేళలో స్థూపం వద్ద మందు తాగి సీసాలు పగలకొడుతున్నారని, రోడ్డుపై వెళ్లే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. మందుబాబుల ఆగడాలను నియంత్రించాలని కోరారు.



జెండా దిమ్మను ధ్వంసం చేసిన మందుబాబులు

కృష్ణాష్టమి సందర్భంగా చిత్రాలు



జగ్గయ్యపేట : కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం పట్టణానికి చెందిన చిత్రకారుడు అల్లి చంద్ర శేఖర్ శ్రీకృష్ణుడు గోప బాలకులతో ఉట్టి కొడుతున్న దృశ్యాన్ని వాటర్ కలర్స్‌తో, గోపాలకృష్ణుడు గోవు ముందు నిల్చున్నట్లుగా, బాల గోపాలుడు ఆకుపై పవళించి ఉన్నట్లు, రాధా కృష్ణులు పిల్లన గ్రోవి ఊదుతున్నట్లుగా బ్లాక్ మార్కర్ స్కెచ్ పెన్నుతో ఛార్ట్ పేపర్‌పై ప్లాస్టిక్ షీట్‌పై గీశారు.

ఫాస్ట్రాక్ ఫ్యాషన్ స్మార్ట్ వాచ్‌లు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : యువత కోసం ప్రముఖ ఫ్యాషన్ టెక్ బ్రాండ్ ఫాస్ట్రాక్ స్మార్ట్ పేరుతో నూతన వాచీలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు టైటాన్ వేరబుల్స్ సేల్స్ హెడ్ ఆదిత్య రాజ్ తెలిపారు. నగరంలోని టైటాన్ షోరూమ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. నూతనంగా మెటల్, సాంకేతికంగా అధునాతన స్మార్ట్ వాచీల కొత్త శ్రేణి బోల్డ్ పేరుతో నూతన స్మార్ట్ వాచీలను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఫాస్ట్రాక్ స్మార్ట్ వాచీలను ఎక్కువ మంది యువత కొనుగోలు చేస్తున్నారని వారిని దృష్టిలో ఉంచుకుని మరిన్ని ఫీచర్లతో రూపొందించినట్లు తెలిపారు. ఎప్పటికపుడు నూతన కలెక్షన్స్‌ను అందించడంలో తమ సంస్థ ముందుంటుందని తెలిపారు. తాము రూపొందించిన కలెక్షన్ స్మార్ట్ వాచ్ విభాగానిన మాత్రమే కాకుండా ఆధునిక యువతకు ఆకర్షణీయమైన యాక్ససరీగా మారుతుందన్నారు. రానున్న కాలంలో మరిన్ని నూతన ఉత్పత్తులను తీసుకురానున్నట్లు తెలిపారు.



దేవాలయ భూమిలో అక్రమ కట్టడాలు

జగ్గయ్యపేట: పట్టణంలోని ధనంబోడు రోడ్డులో నాగలక్ష్మి టెంపుల్ సమీపంలో ప్రభుత్వ దేవాలయ భూమిలో కొందరు అక్రమదారులు యద్దేచ్ఛగా శాశ్వత నిర్మాణాలను చేస్తున్నారని కొందరు ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఇటువంటి అక్రమ నిర్మాణ కట్టడాలకు జగ్గయ్యపేట మున్సిపల్ శాఖ అధికారులు మున్సిపాలిటీ కి కేటాయించిన్నట్లు చూపిస్తున్న వాటర్ ట్యాంకర్ తో నీళ్ళను అందిస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సాహిస్తున్నారని పలువురు నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ దేవాలయ భూములను కాపాడాల్సిన ప్రభుత్వ అధికారుల తీరు కంచే చేను మేసినట్లుగా ఉందని స్థానిక ప్రజలు ముక్కు మీద వేళ్ళు వేసుకుంటున్నారు. వెంటనే ప్రభుత్వ దేవాలయ భూమిలో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న, సహకరిస్తున్న మున్సిపల్ అధికారుల పై చర్యలు తీసుకొని దేవాలయ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలే ఉన్నతాధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన చట్టాలతో ప్రజాస్వామ్యానికి విఘాతం

విజయవాడ మహాధర్నాలో వక్తలు

విజయవాడ: ప్రజాస్వామ్య హక్కులను విఘాతం కలిగించే నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా లాయర్స్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, కాంగ్రెస్ లీగల్ సెల్, ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ సంయుక్త ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన న్యాయవాదులు, ప్రజాసంఘాలు, పౌరహక్కులు, మహిళా సంఘాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కాలం చెల్లిన వలస పాలకుల చట్టాలను రద్దు చేసి నూతన చట్టాలను తీసుకొచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. వాస్తవానికి నూతన చట్టాలలో పాత చట్టాలనే 90 నుంచి 95 శాతం చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాల పేర్లు, సెక్షన్లు, చాప్టర్లు మార్చారని, చేసిన కొద్దిపాటి మార్పులు రాజ్యాంగ విరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవిగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాల ద్వారా న్యాయవ్యవస్థ అధికారాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి పి.వి.సురేంద్ర నాథ్ మాట్లాడుతూ పార్లమెంట్లో ఏమాత్రం చర్చ లేకుండా ఈ చట్టాలను తీసుకొచ్చారని, బ్రిటీష్ వలస పాలకులు కూడా చేయని దుర్మార్గమైన చట్టాలను చేశారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ ఈ నూతన చట్టాల వల్ల ప్రజల కోసం పోరాడే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలపై క్రిమినల్ ముద్ర వేసే అధికారం పోలీసులకు కల్పించినట్టైందని చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని అణగదొక్కేందుకు కొత్త చట్టాలు అనుకూలంగా ఉన్నాయన్నారు. కొత్త చట్టాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఎఐఎల్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు అధ్యక్షత వహించగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు, కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.గురునాథం, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్‌కు చెందిన వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు దోనేపూడి కాశీనాథ్, డివైఎఫ్ఐ రమణ, మట్టా జయకర్, వైసిపి కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. గౌతమ్‌రెడ్డి, న్యాయవాద ఐకాస నాయకులు పిచ్చుక శ్రీనివాస్, నంబూరి శ్రీమన్నారాయణ, ఒగ్గు గవాస్కర్, సుంకర శ్రీనివాసరావు, నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న సురేంద్రనాథ్



మాట్లాడుతున్న గఫూర్

పోరాట ఫలితంగా డయాలసిస్ సెంటర్

3 జిల్లాలకు సేవలు

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రాంతం పారిశ్రామిక ప్రాంతం. ఈ ప్రాంతంలో భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు, ఫార్మా కెమికల్ పరిశ్రమలు ఎక్కువగా ఉండటం, జగ్గయ్యపేట సమీపంలో ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్కులో ఉన్న ఫార్మా కెమికల్ పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలకు ఎక్కువగా కిడ్నీ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఆస్తమా, చర్మ సంబంధిత వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. ఆటోనగర్‌లో గల పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యంతో భూగర్భ జలాలు సైతం షేర్ మహమ్మద్ పేట సాయినగర్, జగ్గయ్యపేట శాంతినగర్‌లో కలుషితం అయ్యాయి. జగ్గయ్యపేట ప్రాంతంలోని నీటిలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉండటంతో ఈ జగ్గయ్యపేట ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉంటున్నారు. జగ్గయ్యపేటలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎంతో పోరాటం చేసింది. సిపిఎం పోరాటం ఫలితంగా ఈ ప్రాంతంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని 2020 ఫిబ్రవరి 20న మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని గల కోహన్స్ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీ 1.30 కోట్ల రూపాయల వ్యయంతో తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో అప్పటి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను చొరవతో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మొదట 4 మిషన్లతో ప్రారంభమైన డయాలసిస్ సెంటర్ ఆ తర్వాత మరో 9 మిషన్‌లు మొత్తం 13 మిషన్లతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ చేయటం జరుగుతుంది.

మూడు షిఫ్టులలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు

కిడ్నీ వ్యాధిగస్తులకు ఈ డయాలసిస్ కేంద్రం 3 షిఫ్ట్ లలో కిడ్నీ వ్యాధిగ్రస్తలకు సేవలు అందిస్తుంది. ఒక్కొక్క షిఫ్ట్‌కు 13 మిషన్ లతో 13 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఒకేసారి డయాలసిస్ చేస్తున్నారు. డయాలసిస్ కేంద్రం ఉదయం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు డయాలసిస్ చేస్తున్నారు. 90 మందికి ప్రస్తుతం డయాలసిస్ జరుగుతుండగా మరో 10 మంది వెయిటింగ్‌లో ఉన్నారు. దీన్నిబట్టి మరికొన్న డయాలసిస్ చేసే మిషన్లు అవసరం కానున్నాయి. ఈ కేంద్రంలో మొత్తం 14 మంది వైద్య సిబ్బంది ఉంటారు. ఇప్పటివరకు 4 సంవత్సరాల కాలంలో ఈ డయాలసిస్ కేంద్రం 258 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సేవలందించింది. ఆగస్టు 20, 2024 నాటికి ఈ డయాలసిస్ కేంద్రంలో 41,255 డయాలసిస్‌లు చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం బ్లడ్ ఇంజక్షన్లు ఈ కేంద్రం ఉచితంగా సరఫరా చేస్తుంది. ఇది ఒక్క జగ్గయ్యపేట ప్రాంతంలో మాత్రమే ఈ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. కిడ్నీ వ్యాధి గ్రస్తులకు రూ.10 వేలు పెన్షన్ ప్రభుత్వం నుండి వస్తోంది. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాలతో పాటు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుండి సైతం కిడ్నీ వ్యాధిగ్రస్తులు జగ్గయ్యపేట డయాలసిస్ కేంద్రానికి వచ్చి డయాలసిస్ సేవలను పొందుతున్నారు.



డయాలసిస్ సెంటర్‌లో రోగులు

పర్మినెంట్‌గా నెఫ్రాలజిస్ట్ సేవలు అందించాలి
సోమోజు నాగమణి ఐద్వా నాయకులు



జగ్గయ్య పేట ప్రాంతం పారిశ్రామికంగా ప్రాంతం. ఈ ప్రాంతంలో పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఎక్కువగా కిడ్నీ వ్యాధిబారిన పడుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగాస్తులు ఎక్కువగా ఉంటున్నారు. పర్మినెంట్‌గా నెఫ్రాలజిస్ట్ లేకపోవడంతో లోటు. కిడ్నీ రోగులు సాధారణ, అత్యవసర సమయంలో కిడ్నీ సమస్య వచ్చి చూపించుకోవాలంటే వీరు విజయవాడ లేదా ఖమ్మం వెళ్లాల్సిన పరిస్థితి కాబట్టి ప్రభుత్వం, స్థానిక నాయకులు స్పందించి తక్షణమే జగ్గయ్యపేట హాస్పిటల్‌కు పర్మినెంట్ కిడ్నీ డాక్టర్‌ను కేటాయించి కిడ్నీ రోగులకు సేవలందించాలి.

నగరంలో 'అహో విక్రమార్క' సందడి



మాట్లాడుతున్న దేవ్‌గిల్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ నగరంలో అహో విక్రమార్క చిత్ర యూనిట్ సందడి చేసింది. తెలుగు చిత్ర పరిశ్రమకు మగధీర చిత్రంతో విలన్‌గా పరిచయమైన దేవ్ గిల్ మాట్లాడుతూ తొలిసారి హీరోగా నటించిన అహో విక్రమార్క చిత్రం ఈ నెల 30న విడుదల కానుందని ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. అహో విక్రమార్క చిత్ర ప్రమోషన్‌లో భాగంగా బందర్ రోడ్‌లోని వివంత హోటల్లో ఆదివారం చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో హీరో దేవ్ గిల్ మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తనను మగధీర చిత్రంలో విలన్‌గా తెలుగు పరిశ్రమకు పరిచయం చేశారని తెలిపారు. ఆనాటి నుంచి తెలుగు , హిందీ కన్నడ మరాఠా చిత్రాలలో అనేక విలన్ పాత్రలలో నటించి ప్రేక్షకులను రంజింపజేసినట్లు పేర్కొన్నారు. 14 ఏళ్ల తర్వాత తాను తొలిసారిగా ఎస్ఎస్ రాజమౌళి శిష్యుడు దర్శకుడు పేట త్రికోటి నిర్మాణంలో అహో విక్రమార్క చిత్రంలో హీరోగా నటించినట్లు తెలిపారు.. ఈ చిత్రంలో తాను ఒక పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో ప్రేక్షకులకు కనిపిస్తానని తెలిపారు. తల్లి సెంటిమెంట్‌తో తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో ప్రముఖ నటీనటులు నటించారని, ప్రముఖ సంగీత దర్శకుడు రవి బస్రూర్ అందించిన సంగీతం ఈ చిత్రానికి హైలైట్‌గా ఉంటుందని ఆయన వివరించారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయని ఆయన తెలియజేశారు. అహో విక్రమార్క టీజర్ ట్రైలర్ను ప్రముఖ దర్శకులు ఎస్ఎస్ రాజమౌళి విడుదల చేయడం సంతోషంగా ఉందని ఇప్పటికే టీజర్ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఆగస్టు 30వ తేదీన ప్రేక్షకుల ముందుకు అహో విక్రమార్క రానుందని తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలని ఆయన కోరారు. ఈ చిత్రానికి తన భార్య నిర్మాతగా వ్యవహరించిందని ఖర్చుకు ఎక్కడ వెనకాడకుండా ఈ చిత్రాన్ని అద్భుతంగా తీయడం జరిగిందని అన్నారు. మగధీర సమయంలో దర్శకుడు పేట త్రికోటి తనకు మధ్య స్నేహం ఏర్పడిందని ఇన్నాళ్ల తర్వాత తనను ఒక హీరోగా ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నారని అన్నారు. అనంతరం దర్శకుడు పేట త్రికోటి మాట్లాడుతూ దేవ్ గిల్ నటన అంటే తనకెంతో ఇష్టమని మగధీర సమయంలో ఆయన చేసిన విలన్ పాత్ర ఎప్పటికీ మరువలేనిది అన్నారు. కథ విన్న వెంటనే ఈ చిత్రాన్ని దేవ్ గిల్ తన తన సొంత ప్రొడక్షన్ ద్వారానే నిర్మించి ఆగస్టు 30న ఐదు భాషలలో చిత్రాన్ని విడుదల చేస్తున్నామన్నారు. దేవ్ గిల్‌ను ప్రేక్షకులు ప్రోత్సహిస్తే మరిన్ని మంచి చిత్రాల్లో నటించే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాత ఆర్తి దేవేంద్ర గిల్ మాట్లాడుతూ దేవ్ గిల్‌కు నటన అంటే ఎంతో ఇష్టమని చాలా భాషల్లో ఆయన విలన్‌గా అనేక పాత్రలు పోషించారని చెప్పారు. అనంతరం నటుడు వంశీ చాగంటి మాట్లాడుతూ తాను ఈ చిత్రంలో ఒక మెయిన్ పాత్రలో నటించానని తన క్యారెక్టర్ ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.